


రమణారెడ్డి

'కిష్టన్నా, అగ్గిపెట్టె వుందా? బీడీ కూడా యివ్వలే, రాములుశెట్టి అంగడికి మనిషినిపంపి గంట యింది, ఎక్కడికెళ్ళినా వ్యవహారాలూ, పెత్తనాలే దానికి.'

'నీకు తెలుసుగా, బీడీబీడీగా తాగను నేను. సగంతాగేసరికి, పారేద్దామనిపిస్తుంది. కనక బీడీని రెండుముక్కలు చేసి తాగుతాను.'

'నాకు దమ్ముకు చాలదే! బీడీవెంబడి బీడీ తాగినా నాకు తృప్తివుండదు. పరవాలేదులే, అంగడికి నేనేపొయ్యొస్తాను. ఇక్కడ బైఠాయించావేం? ఎప్పుడూ అలవాటు లేనివాడివి, ఎక్కడన్నా ఖాతా బేరం తగిలిందేంటి?

'ఇంటిదగ్గర యేంపొద్దుపోతుంది చెప్పు! పొలాలన్నీ యియ్యేడు మక్తాకిచ్చేశాను. వాళ్లు పండించుకుంటారు, నూర్చుకుని యింటిదగ్గరరాసిపోస్తారు. ఎకరాకి పదిహేడుంమక్తా. ఎకరాంలో పుట్టికన్నా రాలదుకదా మన చెరువుపొలాల. ఎట్లాగైనా, మనమే సొంతంగా చేసుకుంటే, యియ్యేడున్న కలుపుతీతకే యెకరా ఏదుం మింగేసి తెమ్మనే పరిస్థితిలోవుంది.'

'నెల్లూరికి పోతున్నావన్నావే;- బాలరాజు-సినిమా అద్భుతంగా వుందట?'

'నేను చూసివచ్చా. శివరావు కోతి అనుకో. పిల్లా! అంటే జల్లుమనిపోతుంది. మన గంటసాల వాళ్ళది తెలుసా పిచ్చకూ? కాబట్టే, అంత బాగుందనుకో. మళ్ళి పోదామని వుందికాని బండి యిరుసు యిరిగిపోయింది.'

'కిష్టన్నా, నీపెళ్ళికాంగానే గుర్రబ్బండి కొనేశావుకదా, యెందుకమ్మేశావు? పట్టాలుదొరకని యీరోజుల్లో టైరుబండివుంటే యీ గతుకుల రస్తాలో హాయిగా వుండేది.'

'మా నాయనోళ్ళు పెళ్ళిముందు పెద్ద ప్లాను వేశారు. గుర్రబ్బండీ, అదీ, యిదీ వుంచుకుని హోదాగా హంగుగావుంటే, కట్నం యింకొక వెయ్యో రెండువేలో పెరుగుతుందని కొనేశారు. మనకుండేది యింతా నాలుగెకరాలు. అప్పు ఏడువేలు.'

'ఓయమ్మ! ఏడు వేలు! నాలుగెకరాలమ్మి కట్టినా చాలదే?'

'పెళ్ళయి నాలుగేళ్ళయింది యింతే, ఆమిషను కొన్నానా, దానికి పోటీబెట్టారు రెడ్డిగారు. క్లోస్, మనం దివాలాతీశాం. కొనబొయ్యేప్పుడు కొరివి, అమ్మబోయేప్పుడు అడివిలాగవుంది మిషనుసంగతి. పదివేలకు కొన్నాను, ఆరువేలకమ్మాను.'

'అమ్మిందెవరికి?'

'నెల్లూరు పెంచెలుశెట్టికి.'

'నెల్లూరు ఖిలాడీకొంపే. ఎవరైనా చదువుకున్నవాణ్ణి తెలిసివున్నవాణ్ణి దగ్గర తీసుకోవెళ్ళివుంటే, వాడియెత్తుకు యెసురెత్తేసివుంటే బాగుండేదే?'

'ఈపెళ్ళిచదువురాయుళ్ళకి పుస్తకాలు పురుగులమాదిరి తొలవడంతప్పితే, ఒక అసలుఫాయిదా వడ్డీలెక్కవెయ్యమను, వీళ్ల బండారం బయటపడుతుంది. పెళ్ళిచేసుకున్నాడంటే కట్నానికే అనుకో.

నాలుగెకరాలవాడుకూడ యీరోజుల్లో భూములు తాకట్టుపెట్టి చదువుకుంటున్నాడు. వీళ్ళందరికీ వుద్యోగాలు ఎక్కడివి? బి. ఏ. వాడు కూడ మంగలిషాపో, కిళ్ళీబంకో పెట్టుకుని వూరేగుతాడు. భూములున్న దానితో సమానమా? మనకు రేషను లేదు,కరువులేదు.మన దర్జాఎం.ఏ.కి కూడారాదు.'

'మీచిన్నాయన కొడుకునిచదివిస్తారంటగదా?'

'ఇప్పటికే ఆయన ఆస్తంతా తగలేశాడు. ఇక యిదీ అయితేనా. వాడు చదువుకూ కొరగాడు, సేద్యానికీ కొరగాడు. నీడలో అలవాటుపడ్డవాణ్ణి పారపట్టుకుని నాలుగు పారల మట్టి బండిలో వెయ్యమను, రొప్పుతాడు.'


'అరరే, బీడీలసంగతే మరిచిపోయాను ... అబ్బ, పాడెండ. చెయ్యడ్డంపెట్టుకున్నా గుచ్చుకుంటుంది. ఆ బడిశేటిది యింకా రాదేం ... కిష్టన్నా, కిష్టన్నా. యిట్రా, ఎవరన్నా వింటారు. ఆ!......అదుగో, కిటికీలో, ఆపిట్ట....చంద్రడి పెళ్ళామా?...మంచివాటమే నీకు!'

'.....................'

* * *

ఆపిల్లది యీవూరుకాదు. కాని చిన్నప్పటి నుంచి కూడా వాళ్ళచుట్టా లింటిలో వుంటూ వుండేది......

ఒకరోజు ... కిష్టడు పసివాడు. వయసులో మాత్రం. అంటే మహావుంటే పద్నాలుగేళ్లుంటవి. నాలుగోతరగతిదాకా చదివి బడి మానేశాడు. ఇంట్లోవాడికి మహాబులిబుజ్జికం. వీళ్ళమ్మ రోజూ ఒకబీడీ యిస్తుండేది, బంగారు కొడుకు తొందరగా పెద్దవాడు కావాలని. వీళ్ళ నాయన అప్పుడప్పుడూ చినడబ్బు యిచ్చేవాడు బెల్లం కొనుక్కోమని. వీడికి పనేమీలేదు, బడికె పొయ్యే పిల్లల్ని ఆపి, బొంగరాలూ, గోలిగుండ్లూ, గాలిపటాలూ ఆడడం, ఆడపిల్లల పెట్టెల్లో పప్పరమెట్లు దొంగిలించడం. ఆడపిల్లలందరికీ వీడిమీద కన్ను. వీడు వాళ్ళకళ్ళకి వీరుడు. తోడిపిల్లల కాళ్లు విరగ్గొట్టేవాడు చెడిగుడులో. కాలవల్లో నీళ్ళ పాములుతీసి అందరినీ భయపెట్టి దూరంగా విసిరేశేవాడు...ఆరోజు రాములవారి తిర్నాళ్ళ... ముక్కుపోతిరెడ్డి వుభయం...గుగ్గిళ్లూ, పంచఖజ్జా



యేమూ పందేరం చేశారు...తమలపాకులు పట్టేలు చిన్నవాళ్ళ కివ్వలేదు...కిష్టడు జేబులో బీడీలకట్ట. వాళ్ళనాయన బేటరిలైటు తీసుకొచ్చి, దేవుడి వాహానందగ్గర ఆడపిల్లల కెదురుగా కూర్చున్నాడు. మిగతా పిల్లలంతా తాళాలతో భజనచేస్తున్నారు. బయట కోలాటం వేస్తున్నారు. వాడి కవేమీ అవసరంలేదు. నిన్న వాడు గోలీలాడుతుంటే, రాజమ్మ వాళ్ళక్కకూతురు సరోజి నెత్తుకునివచ్చి వాడి ఆటచూస్తూ, వాణ్ణి ప్రోత్సహిస్తూ వాడి చూపు గెలిచింది. నిలకడగా చూసేడు...ఇవ్వాళ మొగ్గజడ వేసికునివచ్చింది. పదమూడేళ్ళ పిల్లలాగ లేదు. కోక, రవిక, తమలపాకుల పలచటి చెంపలు, అరటిచిగురు పలచటిచేతులు, గోళ్ళకు గోరెంటాకు మెడలో అడ్డపట్టెడా, నడుముకు వడ్డాణం-కొత్త పెళ్లికూతురుమాదిరి వుంది. రాజమ్మతో పాటు యీ పిల్లకూడా వుంది...దేవుడి పూజ అయింది. పానకం పంచుతున్నారు. వీడికి లోటాలేదు, రాజమ్మకు వుంది. కోక నలిగిపోతుందేమో నని చిన్నపిల్ల చేతికిచ్చింది. తెమ్మని కిష్టడుచూచి ఆ పిల్లని పిలిచాడు. 'అబ్బో పిలగాడా!' అని కులుక్కుంటూ పోబోయే పిల్లని రాజమ్మ పిలిచి, లోటా తీసుకుని వీడి కిచ్చింది.

'నేను తాగినతర్వాత నీకు తీసికొస్తాను' అన్నాడు కిష్టడు.

'అబ్బే, నీ యెంగిలిదా?' అనిచిన్నపిల్ల ఆక్షేపించింది.

'సరే లే, తీసుకురా!' అంది రాజమ్మ.

చిన్నపిల్లకు యిప్పు డర్థమయింది. ఆడపిల్లలకు ఒకటి తెలిస్తే, మరి వూరకుండరు...వుత్సవం బయలుదేరింది. కిష్టడి జుట్టెవరో లాగారు; వెనక్కి చూచాడు: రాజమ్మ నవ్వుతూవుంది, ఆ పిల్ల రాజమ్మ కోకలో దాక్కుంది. కిష్టడి చొక్కా యెవరో లాగారు...వెనక్కి చూచాడు, రాజమ్మ నవ్వుతూవుంది, ఆపిల్ల దాక్కుంది. రాజమ్మ నవ్వు కిష్టడి కోపాన్ని గెలిచింది. రాజమ్మ యేదో యెత్తు యెత్తినట్టుంది, కాబట్టే తన వెనకాలే వస్తుంది. కిష్టడి మూతికి యిసక పూసినట్టయింది. పక్కన రాజమ్మ, రాజమ్మ పక్క యీ పిల్లా నవ్వారు. కిష్టడినోట్లో యిసక—కాదుకాదు, తియ్యగావుంది. పంచఖజ్జాయం...కిష్టడికి పెద్దవాళ్ళకొచ్చే ఆవేశం వచ్చి, రాజమ్మను లాగి ముద్దు పెట్టుకున్నాడు. చిన్నపిల్ల నవ్వింది. రాజమ్మ తమలపాకు పట్టె కిష్టడి కిచ్చింది, వేసికోమని...ఇదేమిటి పరపర మంటుందే? వక్కలపొడా, కాదా ?... బొగ్గుల పొడి...రాజమ్మా, చిన్నపిల్లా తెగ నవ్వారు.

* * *

చిన్నపిల్ల పెద్ద పిల్లయింది. దీనికి నిదర్శనం కావాలంటే, యీ పెద్దపిల్ల చంకలో మరో చిన్న పిల్లవుంది. చిన్నపిల్లా పెద్ద పిల్లల్లో సాధారణ నాచకం పిల్ల. ఈ పిల్లకు పిల్లతనం పోలేదు.' ఈ పిల్ల పేరు శ్రీదేవి, కాదు కాదు శీదేవమ్మ. 'చియ్యమ్మా!' అని ముద్దుగా పిలుస్తారు. ఈపిల్ల యిప్పుడు చంద్రయ్య పెళ్ళాం. చంద్రయ్య పూర్తి పేరు దశరథరామచంద్రారెడ్డి, చంద్రయ్య పెద్దమ్మకూతురు, కూతురు యీపిల్ల-అంటే శ్రీదేవమ్మ చిన్నప్పుడే పెద్దవాళ్లు అనుకున్నారు, వీళ్ళిద్దరికి పెళ్లి చేయాలని. వీళ్లిద్దరికీ తెలుసు, తమకి పెళ్లవుద్దని. కనక చనువుగా తిరిగేవారు. 'పెళ్ళి' అన్న పదంలో యేదో 'కొత్త' కోసం ఆశించడం మామూలు. కాని యీ పిల్లకు 'కొత్త' కనిపించలేదు. వీళ్ళిద్దరూ కాపరం చేయడంలేదు గాని పెళ్ళాం మొగుళ్ళలాగే వుండినారు. కనక యీ పిల్లకు 'వుత్సాహం' లేకపోయింది.

స్వర్గం మన కవుపించనంతకాలం, దాన్ని ఆదర్శప్రాయంచేసి ఆరాధిస్తాం. హిమాలయ శిఖరం మానవపాదాలకు అగమ్యమయినంత కాలం, దాని మీద గౌరీశంకరు లున్నారనుకుంటాం. స్వాతంత్ర్యము రానంతకాలం స్వాతంత్ర్య వుదయానికి కలలు గంటాం. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడ, కొందరు స్వాతంత్ర్యాన్ని ఆదర్శప్రాయంగా ఆరాధించేవాళ్లున్నారు. కనక యీ పిల్లకు-యీ పిల్లేమిటి, ముచ్చటైన శ్రీదేవి అనే పేరుంటే, మగవాళ్ళకు ఆడవాళ్ళ పేరెత్తి పిలవక పోవడం ఒక జాడ్యం-శ్రీదేవికి, 'వుత్సాహం' కోసం 'కొత్త' కోసం అర్రులు చాచడం అసహజం కాదు. ఈ సమాధినుంచి లేచిపోయి, మళ్ళీ జీవమున్న ప్రపంచంలో రసంవున్న యౌవనంలో ప్రాలి పోదామని యీ పంజరంలోరామచిలుక ఆరాటం. కారాగృహాలలో మగ్గి, కమ్మలకు మొఖం అన్చి, యే సూర్యోదయాన్నో, యే చుక్కల మధ్య చంద్రుణ్ణో, స్వేచ్ఛగా హోటళ్ళకు సినిమాలకు షికార్లకు వెళ్లే జంటల్ని చూచే రాజకీయ

ఖైదీల మానసిక పరిస్థితికి నీడ శ్రీదేవి పరిస్థితి. ఎవడో, నవమన్మథుడా కాదు, వచ్చి, యీ కమ్ములు విదిల్చి, కాంతిపడే వీధిలో నిలబెట్టడా అనుకుంటుంది. దగ్గర చుట్టమైన చంద్రయ్యకు ద్రోహం చేస్తున్నానా, అని సందేహిస్తుంది. సినిమాలకు తీసుకువెడతాడు; పౌడర్లూ, చీరెలూ, నగలూ కొనిస్తాడు, బిడ్డని యెత్తుకుంటాడు. ఏ భర్త యినా చేస్తాడిది. కాని అతను 'కొత్త'కోసమని, లేకుంటే యే ఆశయం లేకుండానే, పశుత్వాన్ని అణచుకునేదాని?, పడుచు పిల్లల వెంటపడి పోలేదూ? తనగతో?

బానిసల్లో ప్రస్తుత పరిస్థితిమీద సందేహం వచ్చిందంటే తిరుగుబాటు అవుతుంది. బానిసల్లో స్త్రీ మొదటి తరగతి. ఆడవాళ్ళ దురవస్థకు సాక్షులు మగవాళ్లు. కారకులు కూడ వాళ్లే.

బానిస, గొలుసువంటి పసిపాపను నిదర పుచ్చి, మాయపుచ్చి, వీధి కెదురుగావున్న కిటికీ కమ్ముల కానుకుని దీనంగా నిలుచున్న దనుకోండి. కుర్రవాడు ఎదురుగావున్న అరుగుమీద కూర్చుని సిగరెట్ తాగుతూ పరధ్యానంగా పాడుతున్నా డనుకోండి... బానిస ఆలోచిస్తుంది. ఏ విధాన యితన్ని నా వంకకు ఆకర్షించుకోవడం?...... బానిసకుకూడ పాట వచ్చుననుకోండి...

కన్నులార నిను
గాంచెడి భాగ్య
మదెన్నడో
మానసహారా,
సారంగధరా!'

అన్నదనుకోండి ... కుర్రవాడు చూచా డనుకోండి ...కుర్రపిల్ల చూచిందనుకోండి ... ఇద్దరి చూపులూ కాంతి ధారగా, చైతన్యంగా, చైత్రంగా, వెన్నెలగా, పచ్చగా, వెచ్చగా ఒకరి మనసుల్లో మరొకరిచూపు ఆవేశాన్ని వర్షించిం దనుకోండి... ఈ చూపు అనే విద్యుల్లత వచ్చి, బానిసమనసు అనే చీకటిలోకి పొడుచుకుపోయి నప్పుడు, చీకటి కళ్లు, చీకటి పెదిమలు, చీకటి చేతులు, వ్యాకరణ దోషా లెరుగని భాషలో, మానవుల నోటిలో యేమధుర ముహూర్తానికో అవతరించే భాషలో, వాగ్దేవి స్వయంగా అనుభవించి రాసి పంపిన భాషలో, 'ఇలారా' అన్నదనుకోండి... 'ఇలా' అంటే యెంత బాధ, యెంత తన్మయత్వం తొణికిసలాడిందో? ఇలా, ఇలా! 'రా' అంటే యెన్ని యెన్ని అర్థాలు, ఎన్‌సైక్లోపీడియాలు అర్థమయ్యేనో ఆ కుర్రవాడికి!

* * *

సుందరయ్య కర్థంకాలేదు, కిష్టన్న ఆనాటి నుంచి యెందుకు తనతో మాట్లాడ్డం మానేశాడో! చాల విచిత్రంగా వుంది. తనేమీ తప్పుమాట అన లేదే? సినిమాలు గురించి, మిషను గురించి, చదువుకున్నవాళ్ళ గురించీ... యింకా?... ఆ! 'కిట్టి' గురించీ! శివరావన్నట్లు, 'అద్దిగది' కిటుకు యిక్కడవుంది...

ఆలోచించుకుంటూ, తమ గడ్డి వాములున్న పాటి మట్టి దిబ్బల్లోకి పోతున్నాడు సుందరయ్య. చూపు మాత్రం ముందుకున్న దేగాని దేన్నీ చూడ్డం లేదు... మెరుపు మెరిసినట్లుయింది. ఉలిక్కిపడ్డాడు. అనుకున్నంతా అయింది!...కిష్టన్నా, శ్రీదేవమ్మా! గడ్డి వామి పక్క...! త్వరత్వరగా, గుండె దడ దడమంటుంటే, వెళ్లిపోయాడు సుందరయ్య.

* * *

'ఏరా, సుబ్బిగా, ఏం వచ్చావ్? ఇవ్వాళ నీ కొడుకుని యింట్లో పెట్టుకుని పువ్వు మాదిరి చూస్తుంటే, యింట్లో పని యెవరు చెయ్యాలను కున్నావ్?...ఏడుస్తున్నా వెందుకురా?...... సుబ్బా,...ఏం జరిగిందిరా?' అని విస్తుపోయి, చిన్నబోయి అడిగాడు సుందరయ్య. సుబ్బిగాడు యానాదివాడు. సాత్త్వికుడు. అంటే అమాయకుడు. అంటే అజ్ఞాని. వాడి కొడుకు సుందరయ్య గారింట్లో పశువులకాడి వాడు. కిష్టయ్య తోటలో వీళ్ల కాపరం.

'కిష్టయ్య...కొట్టాడయ్యా!'

'ఎందుకొట్టాడ్రా?'

'నీ దగ్గిరికి పిల్లోణ్ణి పంపియ్యొద్దు అనిండు... బీదోళ్ళం, వాళ్ళమ్మ మంచానపడుంది, పిల్లోడు నెల కిరసగింజలు సంపాయిస్తుండాడు అన్నా గోసి, ఆయన యినిండుకాడు ... నేను బతిమలాడి, కాళ్లు పట్టుకున్నాను. తన్నిండు.'

'నీ కొడుకు నాదగ్గరవుంటే ఆయనకేమంట?'

'అది నాకేం తెలుసయ్యా...'

అవును, అర్థమయింది సుందరయ్యకు. కిష్టన్న యింత పగపడతాడనుకోలేదు సుందరయ్య. మధ్య నలిగిపోయింది సుబ్బిగాడు. నిజం!' పాపం!